

# అడవి

కాడు, వీడు అనే చిత్రాలు చూశాక, అడవి అని వ్రాయాలనిపించింది. కాడు అంటే వూరు. గృహిణికి సంతు కలగ లేదు. ఊరిలో రెండు పార్టీలు. భర్త మోటుమనిషి , భార్యకు మూఢనమ్మకాలు. రాత్రిపూట వెళ్లి మాంత్రికుని చేత పూజచేయించి కోడి బలియిచ్చి వస్తూవుంటుంది. భర్తని రాత్రిళ్లు యింట్లో ఆపలేక పోతున్నది. పెంపుడు కొడుకుని తోడు తీసికెళ్తూ వుంటుంది. పార్టీల మధ్య కావేషాలు పెరిగి, ప్రత్యర్థులు గృహిణిని చంపేశారు. తెల్లారు తుండగా గ్రామస్థులామెను యింటికి తెచ్చి నేలమీదుంచారు. భర్త తన గౌరవం నిలుపుకోటానికి ప్రతీకారం చేయాలని వేటకొడవలితో వెళ్లి హత్యచేసి వస్తాడు. పిల్ల వాడెక్కడికి పోయినా అవమానం యెదురౌతుంది. ఊరు వదిలాడు. అంతా అయాక రంతు అయిందని, పోలీసులొచ్చారు. పోలీస్ స్టేషన్ యేర్పడ్డది.

వీడు అంటే యిల్లు. ఒక వుద్యోగిని, స్థలం కొని యిల్లుకట్టిస్తూ వుంటుంది. చెల్లెల్ని చదివిస్తూ, తాతను కనిబెట్టుకుని వున్నది. ఒక వుద్యోగి ఆమెను పెళ్లాడదలచి సాయంగా వుంటాడు. కట్టడం జరుగుతుండగానే మోసాల నెదుర్కొన్నది. కూలీలామె పక్షం. సూపర్‌వైజ్ చేసి వస్తూ తాత కిందబడి చనిపోయాడు. వుద్యోగి వూరడిస్తాడు. అసలు ఘట్టం చివరికి వచ్చింది. స్థలం శాంక్షన్ చేయటంలోనే పెద్ద మోసం జరిగింది. స్థలం అదివరకే అమ్ముడు పోయింది. పై అధికారి తనకింది అధికారిని నిగ్గదీసి మోసం చూపి తిట్టుతాడు. కిందవాడు పైవాడి కాళ్లు పట్టుకుంటాడు. ఆమెకు స్వంత యిల్లనేది లేనట్టే. తగాదా పరిష్కారం కావాలి. పూర్తి చేయటానికీ వీలులేదు. డబ్బూ వదిలింది.

ప్రపంచం పెద్ద జైలైతే, సంసారం, శరీరం గూడా చిన్న చిన్న జైళ్లేనని ఒక

కవిగానం చేశాడు. అలాగే సంసారం అడవి అనవచ్చు. ఈ అడవిలోకి, పుట్టింటారూ, అత్తారూ, బంధుమిత్రులు, పరిచితులూ అపరిచితులూ, అతిథీ అభ్యాగతులూ, మృగాలలాగా జంతువుల లాగా, పశువులలాగా, పక్షులలాగా, కీటకాలలాగా వస్తూపోతూ వుంటారు. అడవిలో వృక్షాలూ చెట్లూ పూదీగలూ, లతలూ, సెలయేరులూ, ఝురులు, సరస్సులూ, అటవీ సంపద వుండీ బాగా ఆకర్షిస్తాయి.

వయసొచ్చింది. మొగ్గ తొడిగిన పూదీగలాగా వున్న లత ఆధారంలేక అల్లాడుతున్నది. బలమైన మహావృక్షం వంటి నిరంజనం కంటబడి అందుబాటులో వున్నాడు. లత నిరంజనాన్ని చుట్టుకుని పైకి పాకింది. అల్లాడే అవస్థ విరగడైందనుకున్నది. చుట్టూ కలయచూసే, మహావృక్షమూ తానూ గూడా దట్టమైన అడవిలో వున్నామని తెలిసింది. యెండలకెండుతూ, వానలకు తడుస్తూ ఆకురాలుస్తూ చిగిరిస్తూ, పుష్పిస్తూ ఫలిస్తూ లతా నిరంజనం కాలం దొర్లించారు.

2

అత్తగారు వచ్చింది. నిరంజనం గుండె దడదడలాడింది. ఆచారం వ్యవహారం మడీదడీ తెలిసిన వంటవాడిని వలేసి పట్టాలి.

జాచిప్పలాగా నోరూ, గాండ్రు గాండ్రు మన్నట్టు మాటలూ, గుర్రుమంటున్నట్టు తప్పు పట్టటం, అధికారం చూపటం, కించపరచటం యీసడింపు, సోత్కర్షా చూపింది అడవిలో ప్రవేశించిన అత్త.

ఆహారం అందని పులిలాగా పర్యవేక్షణ చేస్తూ నసబెట్టింది.

''వంటవాడు, బనియన్ ధరించే వంటకానిస్తున్నాడు. తలారాస్నానమేదీ?

పన్ను నెప్పి చిగురువాచిందంటే మందు రాచిన దూది పుల్ల యిచ్చాను, దాన్ని పన్ను మీదుంచనూ తీయనూ, వుమ్మనూ, చేతిపాడుగునా లాలాజలం, చేతిమీద నీళ్లు పోసుకోకుండానే వడ్డనకుపక్రమిస్తు ''చిగురు బాగా వాచింది. పన్ను యిప్పుడే పీకరాదు. వాపు తగ్గాలన్నాడు డెంటిస్టు. బనియను విప్పి మేకుకు వేయమన్నా. చలిగదూ అందుకని విప్పలేదు. జంధ్యం ఉండచ్చా'' కొడుకు సరసమాడాడు.

''అదే నాటిదో నల్లగా నులకతాడు లాగా అయింది'' పంజా విసిరినట్టన్నది.

'' ఇవాళ సుబ్బావధానిగారొచ్చి మంత్రపూర్వకంగా కొత్త జంధ్యమిస్తానన్నాడు'' పూలగుత్తీ, మామిడిపిందెలున్న కొమ్మ వూగుతున్నట్టు వూగుతూ నవ్వాడు నిరంజనం. ''వాడిని పంపేసి, మరొకడిని పట్టమంటున్నావంతేనా? లేవలేవు. తీవ్రజ్వరం. నేనే వీలైనంత సేవజేసి, మందు తాగించి, యింజెక్షనిచ్చి వెళ్తున్నానా? శలవుపెట్టి మడిగట్టి వంటా వడ్డన చేయటానికి శలవులేదు. పై ఆఫీసరు ఇన్స్పెక్షన్‌కి వస్తున్నాడు. తనిఖీనాడు ఆఫీసులో లేకపోతే పీకేస్తాడు. మరో వంటవాడు అమ్మకానికి దొరకడు సంతలో. హోటల్సున్నాయి. నెలజీతాలందుతాయి''. నిరంజనేమో నీడనిస్తున్న చెట్టు లాగా నిలబడితే తల్లి నడవలేని యేనుగలాగా నిలబడింది. సణుగుడు మొదలైంది.

ఆదివారం కాఫీ ఫలహారమైంది. వుడతలు కొట్టి పోసినట్టు మనమడు యెక్కగలిగిన చెట్లెక్కి, దోరజామ తిన్నంతతిని వుమ్మేశాడు. కర్రతో కొట్టి గంగరావి రాల్చి తిన్నాడు. టమాటాలు తిన్నాడు. బీచ్ చూస్తామని పిల్లలిద్దరూ వెళ్లారు. పదైనా రాలేదు. లత ఆదుర్దాపడి, బీచ్ వెతికి వచ్చింది. తెలియక దిగితే

అలవేసుకుపోయిందేమోనని భయపడింది. నీరసించింది. యెలాగైతేనేం పదకొండింటికి వచ్చారు పిల్లలు.

''అయ్యో రాజా! యెంత భయపడ్డాను. సముద్రంలోకి లోతుకెళ్లారేమో దొంగ అలవచ్చి లాక్కెళ్తుందని తెలియదు. అక్కడ దాపున బెస్తవాళ్లు లేరు కాపాడటానికి. ఇంత సేపెక్కడికెళ్లారు?'' అని కళ్లు తుడుచుకున్నది లత.

''మా అన్న వున్న హాస్టలూ రూమూ చూపించమన్నాడమ్మా పెదనాన్న గారబ్బాయి శ్రీను. దూరమని చెప్తే వినక పరుగెత్తుకెళ్లి పరుగెత్తి వద్దాం ఒక్క అరగంటలో అని పరుగెత్తాడు'' అన్నాడు రాజు. పొంచివుండి వింటూ పులిలాగా చూస్తున్న అత్తగారు, సివంగిలాగా ఒక్క గెంతులో వచ్చింది.

''నా మనవడు బుద్ధిమంతుడు. అబద్ధాలాడకు. నీ కొడుకే వెధవ. అబద్ధమాడుతున్నాడు. మీ అన్న వున్నదిక్కడే చూపిస్తాం అని తీసికెళ్లాడు. నడవలేను అంటే వినిపించుకోక లాక్కెళ్లాడు. ఒక్కటి వెయ్యి వీపుమీద. ఇప్పటినించే అబద్ధాలా? పెద్దయితే వాడి నోటివెంట నిజమే రాదు. నీవేమీ తక్కువ తినలేదు. మడి మైలలు పాటిస్తున్నావా? నేవెళ్లాక నీ యిష్టానుసారం నడుచుకో. నిన్నడ్డే వాడు లేడు. నా పెద్ద మనుమరాలు పట్నంలో వుంటే వెళ్లాను. వాళ్లున్న భాగం చిన్నదే. అయితేనేం వీధరుగుమీదే మూడ్రోజులూ దొర్లించింది''. ఇంకా కోరలు చూపుతూనే అరుస్తూనే మనమడితో యింట్లో కెళ్లింది.

పులిలాంటి అత్త ఆరోగ్యం చక్కబడింది. అడవీ సంపద యేమేమి కావాలో చెప్పి సంచిల్లో వేయించి, రెండవ తరంతో అడవి వదిలి జనసంచారంలోకి వెళ్లిపోయింది. లత వూపిరితీసుకున్నది.

3

తల్లీ, అప్పా, అన్న, మరో అప్పకొడుకు, రెండో బావగారి న్యూలీ మారీడ్ కొడుకూ కోడలు, ఆడపడుచు ముద్దుల కొడుకూ అడవిలో ఎక్షకర్శన్ పెట్టుకుని వచ్చివాలారు. రేషన్ కార్డుమీద నిత్యావసర వస్తువులు యేమేమి లభ్యమౌతాయో తెచ్చి అడవి సంపద కలిపి యిల్లు రన్ చేస్తున్నది లత. చెట్ల నీడ హాయిగా వుండి సముద్రం మీది నించి చల్లని గాలి వస్తున్నదనీ ఆరు వారాలున్నారు. కోర్టు పనిమీద మరో యెలుగు వచ్చాడు. వంటిమీద పైబట్ట గూడా లేకుండా అడవిలో ప్రవేశించాడు. నిరంజన్ సరసానికన్నాడు ''నీకు సరిపోయే దుస్తులు లేవు. నాకు అంగవస్త్రం అలవాటూ లేదు. రా బావా. గోచీ పెట్టుకు స్నానం కానీయి లేదా బాత్ రూమ్ తలుపులేసుకుని కానీయ్'' అన్నాడు. బాగా అవమానం పొందాడు వచ్చిన చుట్టం. ''నిరంజన్! నేను ఆడదాన్నా. తలుపులేసుకుని స్నానం చేయి అంటే యేమిటి నీ వుద్దేశం?'' అని ఓంద్ర పెట్టాడు బావమరిది. ''నేనీపూటే పోతా పదివేలు చేబదులియ్యి'' అని మళ్లా ఓంద్రపెట్టాడు. చెట్టునించి కాయలు రాలినట్టు డబ్బు రాలలేదుట లేడిలాగా గెంతి అన్నం పెట్టమని ఆదరా బాదరా కానిచ్చి, లేడిలాగా పరుగెత్తినా స్టేషన్లో రైలు కోయిల లాగా కూమని పాడుతూ వెళ్లిపోయిందట. కుక్క కాలుకి దెబ్బ తాకి మూడు కాళ్లమీద వచ్చినట్టు యింటికి వచ్చాడు బావమరిది.

వేటకు వెళ్లినట్టు కొందరు థియేటర్ల వేపు పరుగుదీశారు.

చంద్రకాంతశిలల మీద శయనించినట్లు మరికొందరు చల్లగాలికి ఆరుబయట విశ్రమించారు. లత అప్ప వుడుములాగా అలాగ్గా తిరుగుతూ మంచమూ తానూ యింటి చుట్టూ తిరిగి మంచిచోటు చూసి మంచం వాల్చి

దాని మీద నడుం వాల్చింది.

అన్నయేమో అడివి దున్నపోతులాగా, నదురూ బెదురూ లేక డీసెన్సీ లేక, ఇహిహీ అని నవ్వుతూ అడవి గువ్వలాగా తిరుగుతూ, గుడుగుడుమని తల్లితో యేదో చెప్తూ వెంట వున్నాడు.

''నువ్వు పెద్దన్నను నమ్మి, వాడు డిమాండు చేసినవీ చేయనివీ లాలూచీగా అందిస్తూ చేసిపెడతావు. వాడు నమ్మబలికి టోపీ పెట్టి యెటోపోయి ఖర్చుచేసి వట్టిచేతులతో వస్తాడు. నేను నిన్నే నమ్ముకుని నిన్ను మెప్పించాలని పాటుపడుతూ, నువ్వు చూపిన పిల్లనే పెళ్లాడి, నీకు పొద్దు బోయేందుకు, మనమడిని చంకవేసుకుని పెత్తనాలు చేసి వచ్చేందుకు పిల్లల్ని కంటే నన్ను ఖాతరు చేయవు. చెప్పుకునేది వినవు''.

తల్లేమో నక్క మూతి చివరలు సాగదీసుకున్నట్టు చేసి, అంతరంగంలోని కల్మషం పై వారి కంతుబట్టకుండా నవ్వుతూ వేట కుక్క లాగా, పనివాళ్లేం యెత్తుకుపోతున్నారో కనిబెట్టి నిందలూ నేరాలూ మోపుతూ, తన కష్టాలు చెప్పి మొసలిలాగా కన్నీళ్లు విడుస్తుంది. ''యెంత చాకిరీ చేసినా మెప్పేదీ! యెంతగా ఆదుకున్నా గ్రహింపేదీ! ఇంతమందికి ఒంటి రెక్క మీద వండివారుస్తున్నానా. సొమ్ము తినటానికొచ్చానుట. వెళ్లేప్పుడేదో ఒకటి సంగ్రహిస్తానుట. కూతుర్ని బ్లాక్‌మెయిల్ చేస్తానుట. రాగానే డబ్బు అందిస్తావా లేక బలగంతో రానా అంటానుట. యెండలకు తట్టుకోలేక నీళ్ల యెద్దడి భరించలేక వస్తే యిదీ బిరుదు'' అని అంట్లు తోమి కడిగిపెడుతూ హోరుగాలిలాగా అరుస్తుంది.

వక్కల డబ్బా కనబడలేదట, వక్కపొడి సీసా అల్మరలో కంటబడగానే

చప్పుడు గాకుండా తీయబోతే చేయిజారి కిందబడి చితాచితల్లై వక్కపాడి నేలపాలైంది. లత పరుగెత్తుకొచ్చి కొండ చీపిరితో గదంతా చిమ్మి గాజుపెంకులు పోగుజేసి మందమైన కాగితం మీది కెక్కించి చాటలో వుంచి తీసికెళ్లి గోడవతల పారబోసి, చాటగోడకేసి బాది, యింట్లో కొచ్చింది.

''పారవేశావేం? ఇహిహీ! వక్క పలుకులేరే వాళ్లంగా యిహిహీ!'' కోతిలాగా పళ్లికిలించాడన్న.

''అది నమిలితే గాజుపెంకులూ లోపలికి పోతాయి'' అన్నది లత.

మబ్బేసి పురుముల మెరుపులతో పెద్ద వానబడింది. అది తొలకరి. గుడ్డలారేసే చోటులేదు. ఇంట్లో కిటికీ చువ్వలకు ద్వారాలకు తాళ్లుకట్టి గుడ్డలారేశారు. అడివి గేదెలాగా అప్ప వెరవకుండా వాన పడే సమయంలోనే గాబులో నీళ్లతో సబ్బు షాంపూతో దిగంబరి అయి తలారా స్నానం చేసింది. తాపీగా చీరా రవికా ధరించి చీర తడిపి పిండి నేలమీద ఆరేసింది. వరండాలో అటుగా వున్న వుయ్యాల బల్లమీద కూచుని మోహినిలా జుట్టిరబోసుకు వూగుతూ నవ్వుతున్నది. పాప్‌కారన్ తింటున్నది.

ఆఫీసునించి వచ్చిన నిరంజన్ బొబ్బలుపెట్టి, అంకెలు వేశాడు. అంబా అని అరిచాడు. '' ఇంట్లో బీడీ సిగరెట్ వాసనేమిటి? పొగేమిటి? యెవరిదీ సాహసం? లేకి మూకలాగా కలియబడి, కొట్టుకోటమేగాక, పోట్లాటలో అశ్లీల పదాలు గూడానా? సూటీపోటీలా. ఛిద్రం పెట్టి పోవటానికొచ్చారా? సోమూ యేడీ వాడికిక్కడ ఇంటర్వ్యూ వున్నదని వచ్చాడు. జాబ్ కోసం తిరుగుతున్నాడు. కాకిగోల. ఫోన్ వినబడదు. మా పెద్దన్న ఫోన్ చేశాడు. ఇంటర్వ్యూ ఏనా

పెళ్లిచూపులా? యిల్లరికమా? పెళ్లి చూపులెక్కడ జరపాలి. ఇంటినిండా జనం. తేమ. ఒక్క గది శుభ్రంగా వుండనీయరు''. కొండ యెలుకలాగా అన్నిగదుల్లోకి పరుగెత్తాడు. జల్లెడపట్టాడు గాని సోమూ జల్లెడలోకి తేలలేదు. కొండ శిలలాగా జరజరా వాకిట్లోకి పోయాడు. ముంగిసలల్లే కొందరు వెంట పరుగెత్తారు.

పెన్నిధిని గన్నట్టు సోమూను కనుగొని రాత్రికి యింటికి తెచ్చాడు నిరంజన్. నక్కలల్లే చూచారింట్లో వున్నవారు.

ఆహారం ముక్కున కరుచుకు తెచ్చి పక్షికూనలకి తల్లి పక్షి తినిపించినట్టు సోమూ చేత భోజనం తినిపించాడు.

వాకిట్లో కుర్చీలో కూచోబెట్టి చెప్పాడు ''రేపు పొద్దున్నే యెనిమిదింటికి యింటర్వ్యూకి తీసికెళ్తాను. రెస్టారెంటులో తిండి కానిచ్చి స్టేషన్కి పోతాం. మీ నాన్న ఫోన్ చేశాడు పంపమని పెళ్లిచూపులు జరపాలిట''. సోమూని సుముఖుడిని చేసుకోవాలని ఒరాంగ్ టాంగ్‌లాగా యికిలించాడు నిరంజన్. గాడిద పిల్లలాగా వున్న పనిపిల్ల పళ్లు తరిగి ముక్కలు చేసి వుంచిన పళ్లెం తెచ్చి సోమూ కందించింది. సోమూ వింటూ అన్నాడు.

''నాకిపుడు పెళ్లి తక్కువైందా? నాన్నేమో సర్కస్‌లో జంతువులనాడించినట్లు కొరడా ఝళిపిస్తున్నట్టు కేకలేస్తూ ఆడిస్తాడు. యెక్కడికి పోవాలో యేం చేయాలో గోదురు కప్పలాగా అరుస్తాడు. మింగ మెతుకు లేదు మీసాలకి సంపెంగ నూనె అని, మాడు చెక్కలు తిని మంచి నీళ్లు తాగి జాబ్ కోసం వెంపరలాడుతుంటే పెళ్లా! తాదూర కంత లేదుట మెడకో డోలని దాన్ని గూడా జాబ్‌లో యిరికించాలా నేను'' అని బెకబెకలాడుతుండగా లత పళ్లెంలో

యేదోవుంచి తెస్తూ కనిపించింది సోమూకి. 'అదేమిటి పిన్నీ పాయిసమా, పరమాన్నమా? అదుగో మీ అమ్మ కాట్లకుక్కలాగా స్పైరల్ చేస్తూ వస్తున్నది. ఆమె గుండుమీద బోర్లిస్తె పళ్లెం యిటియ్యి. యెన్ని మాటలు దులిపేసింది? యెవడు రమ్మన్నాడన్నది. యే ముఖం పెట్టుకొచ్చావన్నది. మీ అమ్మ దార్లుకాస్తుంది. నీ దాకా రాలేదేమో! పొంచివున్న చీటాలాగానూ, నాలుగు కాళ్లమీద పరుగెత్తే సివంగిలాగానూ వస్తుంది. మా చిన్నాన్న యింటికి వచ్చాను. నేనెవడబ్బ సొమ్మూ తినటానికి రాలేదు'' అని మోర పైకెత్తి అరుస్తున్న జాగిలం లాగా దూకటానికి సిద్ధంగా వున్నాడు సోమూ.

అవన్నీ విన్న లత తల్లి, దెబ్బ తిన్న పులిలాగా పంజా విసురుతూ మంచెమీదన వేటగానిని లాగి కిందబడేసి గోళ్లతో చీరి కోరలతో చీల్చాలని వచ్చేస్తున్నది. నిరంజన్ పులిని చూసినవానిలాగా ఫ్రీజ్ అయినాడు. సోమూ పళ్లెం విసిరి టోపీ కోతిలాగా పల్లటీలు కొట్టి గోడదూకి అవతలి దిబ్బ మీద నిలబడి గుఱ్ఱంలాగా ఆరుపళ్లు ముందువి చూపిస్తూ హేహే అని హేషారవం చేశాడు.

పులిని పట్టటానికి చెట్టుకి కట్టిన మేకపిల్లలాగా, తల్లిని చూస్తూ నిలబడింది లత. నోటమాట లేదు. తల్లియేమో పళ్లెం దూరానికి విష్ణుచక్రం విసిరినట్టు విసిరి, గేటుదాటిపోయి సోమూని పట్టి జుట్టు పట్టుకు వంగదీసి బాదాలని గేటువేపు వెళ్తే, తాటి చెట్టు లాంటి పోస్టుమానుడు, యెఱ్ఱ సైకిలు గోడకానించి టెలిగ్రామందించాడు.

'' ఇంట్లో యెవరూ లేరని తెలిసి, యిపుడపుడే రారని విని, దొంగలు పడి దోచుకుపోయారు. యేమేమి పోయాయో తెలియదు. మీరు వెళ్లి ఆరువారాలైంది. నాకు శెలవులేదు. అర్జంటుగా రావలెను'' అనే పిడుగు లాంటి

టెలిగ్రాము విని గున్నయేనుగులాంటి తల్లి ఘీంకరిస్తూ నేలకూలింది. మొదలు నరికిన వృక్షంలాగా వున్నది.

4

''పోతాం చిన్నాన్నా. మరియాదలు చెల్లించి ఛార్జీలు యిచ్చావు'' అన్నాడు ఫస్ట్ కజిన్ పొద్దున్నే. పెంపుడు జంతువులాగా చూశాడు.

''జీపొస్తున్నది రెడీగా వుండండి. డ్రైవరు అడవిదొంగ. వాడితో గెలవలేక, మంచిగా వుండమని వేడుకుని డ్రైవింగ్ నేర్పించి వుద్యోగమిచ్చారు గూండాలూ, గూన్సూ వాడి కనుసన్నలలో మెలగుతారు. ముఠా మేస్త్రీలాగా వాళ్లందర్నీ ఒక్కతాటి మీద నడిపిస్తాడు. వాడు కనుసన్న చేస్తే వాళ్లంతా లైటెనింగ్ స్ట్రైక్ చేస్తారు. వాళ్ల కనీసకోర్కెలు తీరుస్తామని వుద్యోగులు కాళ్లబేరానికొస్తారు. నాయనా దేవయ్యా! పంచవన్నెల చిలకలాగా వున్న, పూసిన తంగేడులాగా వున్న నీ కొత్త యిల్లాలు భద్రం. అసలు బంగారు నగలైతే డేంజర్. బీరతీగ పూలేసినట్టు పెట్టుకున్నదే కోడలు. నకిలీ అయితే ఫర్వాలేదు. దారికాసి బెదిరిస్తే వాళ్ల మొహాన దూసి విసిరేయచ్చు. బాండిట్స్ అటకాయిస్తే ముక్కుపుడక దగ్గర్నించీ యిచ్చేయచ్చు. దోవలో రైలులోకి నీ పెట్టిలోకి నీ యెదుటికి భోజనం యెదురుగా వస్తుంది. ఫోన్ చేశాను. వడ్డించేవాడు మనవాడే. ఫర్లేదు. టిప్ రాల్చక్కర్లేదు. సుష్టుగా ఆరగించండి. ఇంటికెళ్లేప్పటికి లేటౌతుంది. శోష వస్తుంది మొహమాటానికి పోతే'' అని నిరంజన్ ఆరణ్యకాలలో పనస వల్లించినట్టు చెప్పాడు. సరీగ్గా మనిషీ అలాగే గడ్డాలూ, మీసాలూ, జుట్లూ పెరిగి ఆరణ్యకాలు అల్లిన విరిసిస్టులాగే వున్నాడు. బొత్తిగా తీరిక లేదు నిరంజన్‌కి. పని పనీ. చుట్టాలూ, మర్యాదలు. ఆబ్లిగేషన్సు.

నిరంజన్ రుక్కులు చదివినట్టు చదివి మర్యాదలు చెల్లించకపోతే, స్వంత స్థావరం నించి ఆత్మీయులు క్షిపణులు విసిరినట్టు తిట్లు, దెప్పులు విసురుతారు లేఖల ద్వారా. ఇంకా స్తోమత వుంటే కదిలివచ్చి ముఖాముఖం తేల్చుకుంటారు.

5

అటవీ సంపద దోపిడీ అయింది. వనదేవతకి జాలివేసింది. తొలకరి తర్వాత వానలు పడగానే, చిగిర్చి, మారాకు వేసి, పుష్పించి ఫలించ సాగింది. పెద్ద వృక్షం పక్కగా కుంకుళ్ల బస్తా కంటబడింది. దళారులు చూడలేదేమో నిరంజన్ దానిని నెత్తికెత్తుకుని మోసుకెళ్లి బద్రీవననాథ్ అనే అటవీశాఖాధికారికి కానుకగా యిచ్చి వచ్చాడు.

''వెట్టివాడివాయేం? అడవిదొంగ లాగా ట్రైనింగిస్తారా. అప్పుడెవరూ అడవిలోకి చొరబడరు. పోచింగూ, స్టీలింగూ చేయలేరు'' అని వీపు చరిచి, కొత్తగా వస్తున్న వేయి బిల్ అందించాడు బదరీవననాథ్. ''మంచి దుస్తులు ధరించు. పామర జనభీమా అన్న రాముని లాగా వుండాలి. నీవు గమనించలేదు. ఒక కొండశిల అడవిలోకి జొరబడి నిన్ను మింగాలని చూసింది. జీబ్రాలాగా గెంతే నిన్ను పట్టటం చాతగాలేదు'' అని హాస్యలాడుతూ రెండు నాల్కల ప్రాణిలాగా తల పడగలాగా ఆడిస్తూ నిరంజన్ని పంపాడు ఆదిశేషయ బద్రీనాథ్.